**'మీట్ ది ప్రెస్ ప్రోగ్రామ్‌కి వెళ్ళడం సింహం గుహలోకి అడుగుపెట్టినట్లే. ఎన్.బి.సి మిమ్మల్ని చీల్చి చెండాడి ముక్కలు చేస్తారు' అని ప్రెసిడెంట్ కెన్నడీ ఫోన్ చేసి హెచ్చరిస్తాడు ఇందిరా గాంధీని. ఆమె న్యూయార్క్‌లో వుంది. అప్పటికి ఇంకా భారత ప్రధాని కాలేదు.**

# ఎంత చెప్పినా తరగని ఇందిరాగాంధీ

## మాలతీ చందూర్

అమెరికన్ ప్రెస్ ఎంత నిర్దాక్షిణ్యంగా ప్రశ్నలు వేసి, వుక్కిరి బిక్కిరి చెయ్యగలదన్నది ప్రపంచ విదితమైన విషయం. అటువంటి ఎన్.బి.సి. స్టుడియోస్‌కి వెళ్లింది ఇందిరా గాంధి ప్రోగ్రామ్‌లో పాల్గొనడానికి. టీ తాగాక "మీకు లిండన్ గెట్టిస్‌బర్గ్ ఎడ్రసు కంఠతా వచ్చా-? చెప్పగలరా?" అని ప్రశ్నించారు అక్కడి ప్రతినిధులు.

"దేనికి?" అని తిరిగి ప్రశ్న వేసిన ఇందిరా గాంధికి, "మా దేశం గురించి మీకెంత తెలుసో కనుక్కుందామని-" అని అన్న వారి జవాబుకి......

ప్రెసిడెంట్ కెనెడీ ముందు రోజే సింహపు గుహలోకి అడుగు పెడుతున్నావని హెచ్చరించిన విషయం వారితో అంటూ ది ఇందిరాగాంధి.

"మేము సింహాలము కాదు. మీమీద గౌరవమూ, అభిమానమూ గల వ్యక్తులం" అని ప్రెస్ క్లబ్ విలేకరులు సంజాయిషీ చెప్పుకుంటుంటే...

"ఈ మధ్య నేను ఆఫ్రికా వెళ్ళొచ్చాను. అక్కడి అడవిలో సింహాలు కూడా చాలా మర్యాదగానూ, అభిమానం తోనూ ప్రవర్తిస్తాయి" అంటూ బదులు చెప్పింది ఇందిరా గాంధి. అక్కడితో ప్రత్యర్థులు కాస్త తగ్గి, కార్యక్రమం ఆరంభించారు. యన్.బి.సి. కార్యక్రమంలో ఇందిరా గాంధి టెలివిజన్ కెమెరాలను నిర్భయంగా ఫేస్ చేసి, సమాధానాలను ఎంత చకచక చెప్పిందో ఆనాడు పత్రికలన్నీ రాశాయి.

ఇందిరా గాంధి ప్రెస్ కాన్ఫరెన్సులు ఒక్కొక్కప్పుడు ఎంత క్లుప్తంగా వుండేవో, ఇంకొక్కప్పుడు అంత దీర్ఘంగానూ, నవ్వులతోనూ నిండివుండేవి. న్యూయార్క్‌లోని 'మీట్ ది ప్రెస్'లో నెగ్గుకొచ్చిన రాజకీయ నాయకురాలికి ప్రపంచంలో తిరుగులేదన్నది ఇందిరాగాంధీ నిరూపించారు.

ఇంతటి ఘటికురాలు, రాజకీయ పరిణతి గల ఈమెని చూసీ చూడగానే, అందరికీ ఈమె అబల, గట్టిగా గాలి వీస్తే పడిపోయేంత అర్భకురాలుగా అనిపించేది. పైకి అబల వలె కనిపించే ఈమె, వజ్ర సంకల్పురాలన్న విషయం కాలక్రమేణా ప్రపంచ నాయకులకు తెలిసివచ్చింది. అయితే ఈమెని మొదటిసారి చూసినపుడు, అప్పటి అమెరికన్ ప్రెసిడెంట్ లిండన్ జాన్సన్ "మొరటుగా, మొండితనంతో ఎత్తులు వేసే పురుష ప్రపంచపు జిత్తుల రాజకీయాలలో ఈ అబల ప్రవేశించింది. నాజూగ్గా, చిగురుటాకులా వున్న ఈమెను రాజకీయపు తాకిడుల నుంచి కాపాడాలి, నేను కాపాడుతాను" అన్నాడట పక్కవారితో. ఆ మాటలు వింటున్నప్పుడు ఇందిరాగాంధి మనసులో ఎలా నవ్వుకుని వుంటుంది అని చాలామంది ఊహాగానాలు చేశారు అప్పట్లో.

* * *

ఇందిరాగాంధి రాజకీయ ప్రవేశానికి వెనుక నెహ్రూగారి ప్రణాళికలు, ప్రయత్నాలు వున్నాయని విమర్శించే వారే ఆమెలోని రాజకీయ విజ్ఞతకి ఆశ్చర్యపడుతుండేవారు. ఆమె ఒక నిశ్చయానికి వచ్చేదాకా ఎంత మథనపడి, ఎన్ని దేశాల ప్రతినిధులతో చర్చించేదో బంగ్లా దేశ విమోచన సమయంలో అందరూ ఎరుగుదురు.

"లక్షలూ, కోట్లూ శరణార్థులు మా దేశం మీదకి వచ్చి పడుతున్నారు. మీరు పాకిస్తాన్‌తో సంప్రతించి, వారిని తిప్పి పంపగల పరిస్థితులు కల్పించండి" అని దేశ దేశాలకి వెళ్లి చెప్పినపుడు, ఎవరూ వినిపించుకోలేదు సరికదా, ఇండియా శరణార్థులని ప్రోత్సహిస్తోంది అన్నారు. ఆ కాలంలోనే జయప్రకాష్ నారాయణ్ "బంగ్లా దేశాన్ని గుర్తించడంలో ఇండియా జాప్యం చేస్తున్నది" అని అన్నప్పుడు, ఇందిరా గాంధి ఇచ్చిన జవాబులో ఆమెకి తన దేశం పట్లా, ప్రజల పట్లా గల ప్రథమ బాధ్యత విశదమైనది. "జయప్రకాష్ నారాయణ్ స్వతంత్ర భారత పౌరుడు. ఆయనకు గల స్వతంత్రం ప్రధాన మంత్రిగా నాకు లేదు. నా ప్రజ, నా దేశ శాంతిభద్రతలు నా ప్రథమ బాధ్యత. దీని తరువాతనే మిగతావి. పాకిస్తాన్ అకారణంగా మమ్మల్ని రెచ్చగొట్టి దాడి చేస్తే ఆ సంగతి వేరు. పరిస్థితిని బట్టి ఏం చెయ్యాలో మాకు తెలుసు" అంది.

* * *

స్వర్గీయ ఇందిరాగాంధి గురించి అనేక సంఘటనలు చెపుతుంటారు. 'ఆమెకి నవ్వడం చేతకాదు. మొండితనంతో పాటు విపరీతమైన సీరియస్‌నెస్ కూడా వుంది' అంటుంటారు. అయితే వ్యక్తిగతంగా పరిచయం వున్నవారు, ఇందిరా గాంధి 'తనని చూసి తాను నవ్వుకోవడమే కాదు, ఇతరుల బలహీనతల పట్ల సునిశితమైన హాస్యం వెదజల్లగలదు' అంటారు.

ఆమెని అనేకమంది ఫోటోగ్రాఫర్‌లు ఫోటోలు తీశారు; పెయింట్ చేశారు; కార్టూన్స్ వేశారు. కార్టూన్స్‌లో ఎక్కువ భాగం ఆమె ముక్కు సాగతీసి వేస్తుండేవారు. ఒకసారి ఇందిరా గాంధీని ఒక ఫారెన్ జర్నలిస్టు ఫోటో తియ్యబోతుంటే, ఫోటోకి సిద్ధం అవుతూ "దయచేసి నా ముక్కును మటుకు మరీ పొడుగ్గా తియ్యకు. ఇప్పటికే చాలామంది సాగతీసి పారేశారు కార్టూన్సులో" అని నవ్వి, నవ్వించిందట ఆమె.



మన బ్యూరోక్రసీ ఎంత సిల్లీగా వ్యవహరించగలదో!... ప్రపంచ ప్రఖ్యాత సంగీతకారుడు జుబిన్ మెహతాకి ఎన్నాళ్ళుగానో ఇజ్రయిల్ సింఫనీని మన దేశానికి తీసుకువచ్చి కచ్చేరీలు ఇప్పించాలని వుండేది. కళకి, కళాకారులకు ఎల్లలు, రాజకీయ విభేదాలు వుండకూడదు. ఈ విషయం అమెరికాకి పయనమై వెళ్ళిన ఒక ఉన్నత నాయకుడికి చెప్పగా, ఆయన వెంటనే ఏర్పాటుచేస్తానని మాట ఇచ్చారు. కొన్నాళ్ళకి జుబిన్ మెహతాకి భారత ప్రభుత్వ కార్యాలయం నుండి ఆహ్వానం వెళ్ళింది. "జుబిన్ మెహతా ఇజ్రయిల్ సింఫనీ కళాకారులతో భారతదేశం రావచ్చునని ఆహ్వానం వెళ్ళింది. అయితే అందులో యూదులు మటుకు వుండరాదన్న ఆంక్షతో."

ఈ విషయం విని ఇందిరా గాంధి మన ప్రభుత్వాధికారుల అతి తెలివికి కదుపారా నవ్వారట. మరోసారి ఆమె సెక్రెటేరియట్‌లోని ఒక అధికారి ఒక సాంకేతిక విజ్ఞాని రాకపోకలకు చిక్కులు కలిగిస్తున్నాడు. ఆ విజ్ఞాని ప్రధానితో ఒక ప్రణాళిక కొరకు చర్చించడానికి వస్తున్నాడు తప్ప, కాలక్షేపం కోసం కాదని ఎవరు చెప్పినా వినిపించుకోక ప్రధాని భద్రత అంటూ గొడవ చేస్తుండేవాడట. ఆ అధికారి విషయం ప్రధాని చెవుల దాకా వెళ్ళింది.

ఆమెకి కోపం రాలేదు. ఆ వ్యక్తిని అక్కడి నుంచి మారుస్తూ "తను తల్లిదండ్రుల అధిక సంతానంలో ఆఖరివాడు. అంచేత తెలివితేటలు ఇగిరిపోయి పుట్టి వుంటాడు" అని నవ్వేశారుట. ఇలాంటి సందర్భాలలో ఆమె చాలాసార్లు వాపోయేవారుట-'అధికారంలో వుంటే ఎన్నో పనులు చెయ్యొచ్చు అనుకునేదాన్ని. కాని అధికార హోదాలో నేను బందీని.. బయటపడలేనటువంటి బందిఖానా ఇది-' అని.

ఒకప్పుడు అమెరికన్ రాయబారి అయిన జాన్ గాల్‌బ్రిత్ రాజాజీ మెమోరియల్ లెక్చర్ ఇవ్వడానికి ఢిల్లీ వచ్చినపుడు

ఇందిరా గాంధీని కలుసుకుంటారు. ఆదరంతో, ఆత్మీయతతో, నిరాడంబరమైన విందు ఇచ్చి తరువాత సాగనంపడానికి కారు వద్దకు వచ్చిన మిసెస్ గాంధిని అడుగుతాడు గాల్‌బ్రిత్, "ఇన్ని బాధ్యతలు, బరువులు పెట్టుకుని మీరు ఎలా నిభాయించుకు రాగలుగుతున్నారు" అని. దానికి ఆమె చెప్పిన బదులు: "కొన్ని సందర్భాలలో కాస్త శ్రమగా వుంటుంది. అయితే పదవి బయట వుండే కంటే పదవిలో వుండడంలోనే ఎక్కువ చైతన్యమూ, తృప్తీ వుంది"–అటువంటి నిజాయితీ ఒక్క ఇందిరా గాంధీకే చెల్లింది.

*        *        *

డెభ్భైకోట్ల ప్రజానీకానికి ప్రధాని, ప్రపంచ రాజకీయాలలో అతి ప్రముఖ వ్యక్తి అయిన ఇందిరా గాంధీ నిరంతరం భారతదేశ ప్రగతి గురించి, తన ప్రజల క్షేమం గురించి ఆలోచించేది. జనాభా సమస్య, ఆహార ధాన్యాల కొరత, అటవీ ప్రదేశాలు, వన్యమృగ సంరక్షణ, వాతావరణ కాలుష్యం, విజ్ఞాన ప్రగతి, అణుశక్తి, విద్య, చేతిపనులకు ప్రోత్సాహం, పిల్లల సంక్షేమం ఇలా ఆమె స్పృశించని విషయం లేదు. ఎమర్జన్సీ తరువాత, ఎన్నికల పరాజయం, జనతా గవర్నమెంటు కాలంలో అవమానాలూ, కారాగృహం- ఈ ఘట్టాల తరువాత చికమగలూర్‌లో పార్లమెంటుకి నిలిచి, గెలిచి, కాంగ్రెస్ పార్టీకి లీడరయింది. ఆ కాలంలో ఒకసారి బీహార్‌లో ఫ్యామిలీ ప్లానింగ్ మహాసభ జరుగుతూ వుంది. ఆ సభలో ఇందిరా గాంధి పాల్గొన్నా ఉపన్యాసం ఇవ్వడానికి అంగీకరించలేదు కార్యకర్తలు. ఫామిలీ ప్లానింగ్ వత్తిడి వల్ల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందన్న వాదం ప్రజలలో ప్రబలి వుంది. ఆ విషయంపై ఇందిరాగాంధి ప్రసంగిస్తే ప్రజలు అల్లరి చేస్తారేమోనన్న భయంతో, వేదికమీద ఊరికే కూర్చోమన్నారు కార్యకర్తలు. ఆ బహిరంగ సభకు విపరీతంగా పామర ప్రజ దూర దూరాలనుంచి వచ్చారు. ఉపన్యాసాలు ప్రారంభమయ్యాయి. వక్తలు ఒకరి తరువాత ఒకరు మాట్లాడుతూనే వున్నారు. ప్రేక్షకులలో అసంతృప్తి, ఆలజడి, నిరాశ. ఇంతలో వేదికపైకి ఒక పల్లెటూరి వృద్ధుడు వచ్చి,

"మాతాజీ, మీరు మాట్లాడరా?" అని అడిగాడు శ్రీమతి గాంధీని.

"నేను మాట్లాడకూడదంటున్నారు" అంది ఇందిరా గాంధి.

"అమ్మా, మీ మాటలు విందామని మేము ఇంత దూరం నుంచి వచ్చాం. ఈ వచ్చినవాళ్ళమంతా మీ ఉపన్యాసం వినాలన్న ఆశతో వున్నాం. మీరేం మాట్లాడినా మాకు ఇష్టమే" అని సూటిగా హృదయపూర్వకంగా అన్నాడట.

'ప్రజకి తనపై ఆగ్రహం వచ్చింది. నమ్మకం పోయింది' అన్న జనతా ప్రభుత్వపు ప్రచారం ఎంత కట్టుకథో ఆ క్షణంలో బోధపడింది. ఆ రోజున ఆమె ప్రతి మాటను అతి శ్రద్ధగా విని, ఆఖరున ప్రజలు చేసిన హర్షధ్వానాలతో ఆకాశం దద్దరిల్లిపోయిందట.

ఆమె ప్రధాని అయేనాటికి మన దేశం ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకునేది. ఒక పదేళ్ళలో ఇండియా ఆహార ధాన్యాలని ఎగుమతి చేయగలిగినంతటి సుస్థిరత సంపాదించగలిగిందీ అంటే ఇదంతా ఇందిరాగాంధి 'గ్రీన్ రివల్యూషన్' ద్వారా తెచ్చిన మార్పు. భారతదేశంలోని బీద రైతులకు ఆమె ఇచ్చిన చేయూత, ఇండియా చేసిన ఈ కృషిని అంతర్జాతీయ స్థాయిలో అందరూ గుర్తించారు. అన్నిటికంటే ఆసియాలో జరిగిన పదిహేనవ 'ఎఫ్.ఎ.ఒ' కాన్ఫరెన్సులో ఆమె ఇచ్చిన ఉపన్యాసం విని ముగ్ధుడై, ఒక శ్రోత అక్కడి కక్కడే డెభ్భైవేల డాలర్లు డొనేషన్ ఇచ్చి, ఎలా వినియోగించాలో అన్న 'ఛాయిస్' నిర్వాహకులకు వదిలేశాడు. 'ఆ ధనం ఎలా



వాడాలి, ఏ పథకానికి కేటాయించమన్నారు' అని నిర్వాహకులు అడగ్గా, 'The last, the lost, the lowest, and the least' (చివరివారు, గుర్తుతెలియనివారు, అడుగునున్నవారు, అతి చిన్నవారు- వారికోసం వాడమన్నదట — ).

చిన్నపిల్లల విషయంలో ఇందిరాగాంధికి గల ఆరాటం ఈనాటిది కాదు. పండిట్ నెహ్రూ ప్రధానిగా వున్న రోజుల నుంచీ ఆమె భావి పౌరుల కోసం చిత్రకళ, సినిమాలు, బాలల ఉత్సవాలు ఇలా ఎన్నో కొత్త పథకాలు రూపుదాల్చడానికి ప్రయత్నాలు చేస్తుండేది. ఈనాడు అంతర్జాతీయ స్థాయిలో బాలలకు చిత్రకళలో పోటీలు నిర్వహిస్తున్నారంటే అందుకు ప్రాతిపదిక వేసిన వ్యక్తి ఇందిరా గాంధి. 'శంకర్స్ వీక్లీ'లో వెయ్యిమంది పిల్లలతో ఆరంభమైన పోటీ ఈనాడు దేశ దేశాల బాలలకు పాకింది.

నెహ్రూజీ కాలంలో అంటే అరవైల్లో ఇందిర ఆధ్వర్యంలో ప్రజాహిత కార్యాల కోసం ఫండ్స్ కలెక్ట్ చేయడం జరిగింది. ఈ డబ్బు ఎలా వినియోగించాలో అన్నది నెహ్రూగారు తన సహజ ధోరణిలో పెడవాటి జాబితాతో చిన్న ధర్మోపదేశం ఇచ్చారు కూతురికి. ఆ ఉపన్యాసం అంతా విని, ఇందిరాగాంధి "నాన్నా, ఈ డబ్బుని ఏం చెయ్యాలో, ఎలా వినియోగించాలో ముందే నిశ్చయం చేసుకున్నాం. ఇది చిల్డ్రన్స్ ఫండ్‌కి కేటాయిస్తున్నాం" అంది నవ్వుతూ దృఢమైన కంఠంతో.

ప్రఖ్యాత గాయని ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి తమ తండ్రి కాలంనాటి కుటుంబ స్నేహితురాలైనా, స్నేహాన్ని అలానే పదిలంగా కాపాడుకుంటూ రావడంలో ఆమెకి ఆమే సాటి. ఎమ్.ఎస్. అతిథిగా వున్న రోజులలో ఆ సంగీతకారిణి కంఠం దెబ్బ తినేవి, ఆమెకి సరిపడనివి అయిన పదార్థాలు భోజనాల బల్ల దగ్గరకు రానిచ్చేది కాదు. అలాంటివి వండకూడదని ఆంక్ష విధించే ఇందిరాగాంధికి తనని చూడడానికి తల్లితండ్రులతో పాటు వచ్చి సెక్యూరిటీవారు తనని లోపలకు రానివ్వని కారణాన నిరాశతో బయట కూర్చున్న పదేళ్ళ అశోక్‌ని ప్రత్యేకంగా పిలిచి, మాట్లాడి, ఆ పసివాడితో కలిసి ఫోటో తీయించుకోగల హృదయ వైశాల్యం వుంది. పువ్వులు మాట్లాడుతాయి. పువ్వులకు హృదయం వుంది, క్రూర జంతువులకు బతికే హక్కు వుంది, ఈ దేశానికి, ఈ ప్రజలకు స్వేచ్ఛలో బతకగల నైతిక శక్తి వుంది అని వివిధ కోణాల నుంచి వివిధ రకాలుగా చూడగల జాతీయత, అంతర్జాతీయత మూర్తీభవించిన మానవతావాది ఇందిరా గాంధి.

అందుకే ఆమె ఒకసారి "ఈ ఇందిరాగాంధి వున్నా లేకపోయినా మా దేశవాసులు , మా భారతీయులు ఏనాడూ పిరికిపందని తమ నాయకునిగా ఎన్నుకోరు అన్న ప్రగాఢమైన విశ్వాసం నాకు వుంది" అని అనగలిగింది. ఈ ప్రజల పట్ల, ఈ జాతి పట్ల అంతటి ప్రేమాభిమానాలు గల స్థితప్రజ్ఞురాలు ఇందిరాగాంధి.